క్లుప్తంగా

పనుల్లో అలసత్వం వద్దు



డ్రైనేజీ కాలువ పనులను పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: అలసత్వం వహించకుండా గ్రామాల్లో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఆదేశించారు. గురువారం మండలంలోని పి కొత్తూరులో జెడ్పీ నిధులతో నిర్మిస్తున్న సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల పనులను ఆయన పరిశీలించారు. కాంట్రాక్టర్లతో మాట్లాడారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయాలన్నారు. సీసీ రోడ్లు వేసిన తర్వాత పక్కాగా క్యూరింగ్ చేయాలన్నారు.

నవోదయకు ఎంపిక



యశ్వంత్



మోక్షిత

వి.కోట: మండలంలోని దొడ్డిపల్లె ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న యశ్వంత్‌సాయి నవోదయ పాఠశాలలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు రాధాక్రిష్ణ గురువారం తెలిపారు. గత ఏప్రిల్‌లో నిర్వహించిన నవోదయ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరచి యశ్వంత్ సీటు సాధించాడని చెప్పారు. టీచర్లు అతడిని అభినందించారు. అలాగే పట్టణానికి చెందిన మోక్షిత 100కు 97 మార్కులు సాధించి నవోదయకు ఎంపికైంది.



రెడ్డి జాహ్నవి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలం 106 రామిరెడ్డిగారిపల్లెకు చెందిన రవి కుమార్తె రెడ్డిజాహ్నవి జవహర్ నవోదయ విద్యాలయానికి ఎంపికైంది. ఈ విద్యార్థిని 106 రామిరెడ్డి గారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వతరగతి చదివింది. పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

సదుంలో



తమన్‌తేజ

సదుం: మండలంలోని నడిగడ్డకు చెందిన తమన్ తేజ్ నవోదయకు ఎంపిక అయ్యాడు. విద్యార్థి చింతలవారిపల్లె ప్రాథమిక పాఠశాల్లో ఐదోతరగతి చదువుతూ, ఆరో తరగతిలో చేరడానికి రాసిన ప్రవేశ పరీక్షలో ప్రతిభ కనబరిచి అర్హత సాధించాడు. తమన్ తండ్రి కిశోర్‌కుమార్ ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎంపిక



మాట్లాడుతున్న యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్ నాయుడు

పలమనేరు: మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని గురువారం స్థానిక బాలికోన్నత పాఠశాలలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేమచంద్రారెడ్డి, గౌరవాధ్యక్షుడిగా బషీర్ అహ్మద్, ఉపాధ్యక్షులుగా మంజులారాణి, హరిక్రిష్ణ, ప్రధాన కార్యదర్శిగా రవీంద్ర, కోశాధికారిగా దేవీప్రియ, కార్యదర్శులుగా సుబ్రమణ్యం, భాస్కర్, సోఫియా, శేఖర్, నిరూప, వరయ్య, జిల్లా కౌన్సిలర్లుగా పుష్పావతి, ఇందిర, రమేష్‌బాబు, ఉమాపతి నాయుడు, సహదేవయ్యతో పాటు మిగతా సభ్యులను ఎన్నుకున్నారు. ముఖ్య అతిథిగా జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి క్రిష్ణమూర్తి, రాష్ట్ర కౌన్సిలర్ ప్రకాష్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సూచిక బోర్డుల ఏర్పాటు



కల్లూరు ఘాట్ రోడ్డులో ఏర్పాటు చేసిన సూచిక బోర్డు

పులిచెర్ల(కల్లూరు): కల్లూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోడ్డు మలుపులు, ప్రమాదకర స్థలాల్లో కల్లూరు ఎస్ఐ రవిప్రకాష్ రెడ్డి సూచిక బోర్డులను ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనదారులు మలుపుల వద్ద తగు జాగ్రత్తలు తీసుకుని వాహనాలను నడపాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదన్నారు. ఆటోల్లో పరిమితికి మించి జనాలను తీసుకెళ్లకూడదన్నారు. ట్రాఫిక్ రూల్స్ తప్పక పాటించాలని సూచించారు.

కరెంట్ చార్జీలు తగ్గించరూ!

పలమనేరు: రకరకాల సుంకాల పేరిట పెంచిన కరెంట్ చార్జీలను తగ్గించాలని సీపీఎం నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం స్థానిక సీపీఎం కార్యాలయం జిల్లా నాయకుడు గిరిధర్ గుప్తా మాట్లాడారు. కరెంటు చార్జీల ప్రభావం పేదలపై పడుతోందని పేర్కొన్నారు. ఓబులురాజు, ఈశ్వర్, సుబ్రమణ్యం, యశస్విని పాల్గొన్నారు.

రాగిపంట సాగు పెంపే ప్రభుత్వ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీ అన్నపూర్ణదేవి

- గిట్టుబాటు ధరకు ప్రభుత్వమే కొనుగోలు
- వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు హబీబ్ బాషా

పలమనేరు: రైతులు రాగిపంటను సాగు చేయాల్సిన అవరసం ఎంతైనా ఉందని చిత్తూరు భూసంరక్షణ ఏడీ హబీబ్‌బాషా అన్నారు. 2023ను ప్రభుత్వం చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో పలమనేరు డివిజన్‌లోని ఆర్‌బీకే సిబ్బందికి అవగాహ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, రాగి పంటకు ప్రభుత్వం గిట్టుబాటు ధరగా క్వింటాలుకు రూ.3800గా నిర్ణయించిదని, పంటను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. స్థానిక ఏడీ అన్నపూర్ణదేవీ మాట్లాడుతూ, రాగి పంట పేదవాని పంటగా చెప్పుకోవచ్చన్నారు. తక్కువ ఖర్చుతో మంచి దిగుబడులను సాధించవచ్చన్నారు. రాగి పంటకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహకాలను రైతులు సద్వినియోగం చేసుకుని ఈ ప్రాంతంలో రాగి సాగును పెంచేందుకు ఆర్‌బీకే సిబ్బంది కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని వ్యవసాయాధికారులు, ఏఈఓలు పాల్గొన్నారు.

మామిడి రైతులకు హార్వెస్టర్లు

పలమనేరు: పలమనేరు ఉద్యానశాఖ పరిధిలోని మామిడి రైతులకు ప్రభుత్వం పంపిణీ చేసిన మ్యాంగో హార్వెస్టర్లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. వైఎస్సార్ యంత్ర సేవ పథకం కింద స్థానిక ఉద్యానశాఖ పరిధిలోని మామిడి రైతులకు మామిడి కాయలను కోసేందుకు వీలుగా ఉండే 500 హార్వెస్టర్లను పంపిణీ చేశారు. ఒక్కోదాని ధర రూ.310గా ఉండగా, రైతులకు 75శాతం సబ్సిడీతో రూ.75లకే వీటిని ఇటీవల అందజేశారు. బ్లేడ్, నెట్ ఉండడంతో టేబుల్ రకమైన మల్లిక, బేనిషాలాంటి రకాలను చెట్టు నుంచి కోసేందుకు ఇవి సౌకర్యంగా ఉంటున్నాయని రైతులు చెప్పారు. కాయలకు దెబ్బతగలకుండా నెట్‌లో పడడంతో పండ్లు నాణ్యతతో ఉంటాయని స్థానిక ఉద్యానవనశాఖాధికారి లక్ష్మీప్రసూన తెలిపారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

కుప్పంరూరల్: గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం సక్రమంగా అందజేయాలని సీడీపీఓ అరుణశ్రీ అన్నారు. గురువారం షాహీ గార్మెంట్స్, సేవ్ ద చిల్డ్రన్స్ ఆధ్వర్యంలో అందజేస్తున్న పోషక అభియాన్ అమలుపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీడీపీఓ అరుణశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సమయానికి అందించాలన్నారు. అనిమియా ఉన్న విద్యార్థులపై శ్రద్ధ చూపాలన్నారు. పిల్లలకు చిన్నతనంలో ఇచ్చే పౌష్టికాహారమే పెద్దయ్యాక ఎక్కువ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మహేష్‌కుమార్, జ్యోతి, ధనుంజయ, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకు..

గంగవరం: మండలంలోని పత్తికొండలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, పార్టీ మండల కన్వీనర్ మోహన్‌రెడ్డి గురువారం తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

24న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

రొంపిచెర్ల: ఈ నెల 24న రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్షను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సరళ గురువారం తెలిపారు. ఆదర్శ పాఠశాలలో 2023–24 సంవత్సరానికి 7, 8, 9 తేదీల్లో ఖాళీగా ఉన్న సీట్లకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. శనివారం ఉదయం 9 గంటలకు రొంపిచెర్ల క్రాస్‌లోని ఆదర్శ పాఠశాలలో పరీక్ష ఉంటుందన్నారు. పరీక్షల్లో అర్హత మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాలలో చేర్చుకుంటామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ సరళ కోరారు.

ధ్రువీకరణ పత్రాల మంజూరుపై విచారణ



దిగువపోకలవారిపల్లెలో జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసరుకు వినతిపత్రం అందజేస్తున్న పోకల చంద్ర

పులిచెర్ల(కల్లూరు): మండలంలోని దిగువపోకలవారిపల్లె సచివాలయంలో పెరిక బలిజ కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల మంజూరుపై గురువారం కలెక్టరు ఆదేశాల మేరకు జిల్లా బీసీ వెల్ఫేర్ ఆఫీసరు రబ్బానీ బాషా విచారణ చేశారు. స్థానిక ఎంపీటీసీ పోకల చంద్ర దీనిపై వినతిపత్రం అందజేశారు. గత కొన్నేళ్లుగా ఈప్రాంతంలో నివసించేవారికి పెరిక బలిజ కుల ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్నారని, కానీ ప్రస్తుతం ఇవ్వడం లేదని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారి అభ్యర్థన మేరకు సచివాయంలో అధికారులు సమావేశం ఏర్పాటు చేసి ఇదివరకు జారీ చేసిన కుల ధ్రువీకరణ పత్రాలు, అభ్యర్థనలను పరిశీలించారు. అనంతరం నివేదికను కలెక్టరుకు పంపుతామని వారు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు శేషగిరిరావు, ఎంపీటీసీ పోకల చంద్ర, ఆర్ఐ దొరస్వామి, స్థానిక సర్పంచ్ పోకల ఉమాదేవి, ఎంపీటీసీ మాజీ శ్రీనివాసులు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగదేవతలకు మరమ్మతులు

పుంగనూరు: పట్టణంలోని తోపుమఠం వద్ద శిథిలావస్థలో ఉన్న నాగదేవతల విగ్రహాలకు మరమ్మతులు చేశారు. గురువారం దళిత నాయకులు రాజు, పెంచుపల్లి కృష్ణప్ప, టి.కృష్ణప్ప, వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మణ్‌రాజు కలసి మరమ్మతులు చేసి, నాగదేవతల ప్రాంతాన్ని శుభ్రం చేశారు. ఎంతో పురాతన విగ్రహాలకు పూర్వవైభవం తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని రాజు తెలిపారు.

మద్యంబాబులకు జైలుశిక్ష

సదుం: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఆరుగురికి కోర్టు ఒక్కరోజు జైలుశిక్ష విధించినట్టు ఎస్ఐ మారుతి గురువారం తెలిపారు. వాహనాల తనిఖీల్లో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని స్పెషల్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరిచామన్నారు. వారికి జైలుశిక్షతో పాటు ఒక్కొక్కరికీ రూ.6 వేలు చొప్పున జరిమానా విధిస్తూ జడ్జి తీర్పు చెప్పినట్టు ఆయన చెప్పారు.

పిల్లలను పనిలో పెట్టుకుంటే కేసులు



మాట్లాడుతున్న న్యాయమూర్తి సింధు

పుంగనూరు: సమాజంలో ఎక్కడైనా బాల కార్మికులను పనులకు వినియోగిస్తే సంబంధిత సంస్థలు, వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని అడిషినల్ జూనియర్ సివిల్‌జడ్జి సింధు హెచ్చరించారు. గురువారం బాల కార్మికుల నిర్మూలన వారోత్సవాల్లో భాగంగా ఎన్ఎస్ పేట పాఠశాలలో న్యాయవిజ్ఞాన సదస్సు ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం బాల కార్మికుల నిర్మూలన కోసం రూపొందించిన చట్టాలను కఠినంగా అమలు చేయాలన్నారు. బాలలు ప్రతి ఒక్కరూ పాఠశాలలకు విధిగా వెళ్లేలా వారి తల్లిదండ్రుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. ఇందుకోసం మురికివాడల్లో అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని సూచించారు. బాల కార్మికులు ఎక్కడ కనిపించినా సంబధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు సూచించారు. సమావేశంలో ఎంఈఓ కేశవ రెడ్డి, ఎస్ఐ మోహన్‌కుమార్, న్యాయవాది రాఘవేంద్ర, హెచ్ఎం కుమార్ పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం



తహసీల్దార్‌తో అధికారులు, నాయకులు

శాంతిపురం: మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఏ.నరసింహులును గురువారం మండల ప్రముఖులు సత్కరించారు. ఎంపీడీఓ హేమమాలిని, రెస్కో వైస్ చైర్మన్ కోదండరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బుల్లెట్ దండపాణి తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రతాప్‌రెడ్డి, చిన్నారిదొడ్డి సర్పంచ్ బాలసుబ్రమణ్యం, కృష్ణ, పద్మనాభయ్య, ఆనందరెడ్డి, బాబు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి

సదుం: జగనన్న సురక్ష పథకంలో భాగంగా సంక్షేమ పథకాల లబ్ధిదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఎల్లప్ప తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో జగనన్న సురక్ష శిక్షణ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తప్పనిసరిగా ప్రతి లబ్దిదారుని ఇంటికి వెళ్లి, సంక్షేమ పథకాల అమల్లో సమస్యలు ఉంటే గుర్తించి, వాటిని పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఎంపీడీఓ వరప్రసాద్, సర్పంచ్ ఉషారాణి, ఎంపీటీసీ సభ్యుడు ఆనంద, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ ప్రకాష్ రెడ్డి, కో–ఆప్షన్ మెంబరు ఇమ్రాన్, ఎంఎల్‌ఓ బావాజీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు చెక్ పెడదాం



మాట్లాడుతున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి

పుంగనూరు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి కుటుంబాన్ని విచారించి, వారి సమస్యలు పరిష్కరించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మండల సర్వసభ్య సమావేశాన్ని పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్‌తో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ తయారు చేసిన మండల సమగ్ర సమాచార బుక్‌లెట్లను సభ్యులకు పంపిణీ చేశారు. ఈ మేరకు అజెండాను ఆమోదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి వారి సమస్యలు గుర్తిస్తే, వాటిని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి దృష్టికి తీసుకెళ్లి ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూస్తామన్నారు. మంత్రి పీఏ చంద్రహాస్, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, ఎంపీడీఓ నారాయణ, తహసీల్దార్ సీతారామన్, వైస్ ఎంపీపీలు ఈశ్వరమ్మ, సరోజమ్మ తదితరులు పాల్గొన్నారు.

24న ఉచిత కంటి వైద్యశిబిరం

పుంగనూరు: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 24న శంకర్ నేత్రాలయ వారిచే ఉదయం 9 గంటలకు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు నాగరాజు, మునస్వామి మొదలియార్ తెలిపారు. గురువారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో ప్రతినెల 4వ శనివారం కంటి వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. కంటిజబ్బులు కలిగిన వారికి శిబిరంలో చికిత్స అందించి, చెన్నైలో ఆపరేషన్లు ఉచితంగా నిర్వహిస్తామన్నారు. రోగులకు వసతి, భోజన సదుపాయం కూడా కల్పిస్తామని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా కేశవరాజు



జిల్లా కేంద్రంలో కేశవరాజును సత్కరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శాంతిపురం: యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని వెదురుగుట్టపల్లెకు చెందిన కేశవరాజు నియమితులయ్యారు. గురువారం చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు నుంచి ఈ మేరకు నియామక ఉత్తర్వులు అందుకున్నట్టు కేశవరాజు తెలిపారు. యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు రామారావు నేతృత్వంలో యువత సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

తిమ్మరాయస్వామికి పూజలు



కుప్పం: పట్టణ సమీపంలోని గుత్తార్లపల్లెలో ఉన్న ప్రసన్న తిమ్మరాయస్వామికి గురువారం ప్రత్యేక పూజలు చేశారు. గత వారం రోజుల క్రితం ఆలయ ప్రాంగణంలో మహా కుంభాభిషేకం నిర్వహించి, తిమ్మరాయస్వామి విగ్రహప్రతిష్ట చేశారు. అనంతరం 41 రోజుల పాటు జరిగే మండల పూజల్లో భాగంగా స్వామివారికి అభిషేకం, మంగళహారతి నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

భార్యపై ఫిర్యాదు

పలమనేరు: మైనర్ బాలిక అయిన కుమార్తెను తన భార్య కొందరితో కలసి రహస్యంగా పెళ్లి చేసిందంటూ తండ్రి శంకర గురువారం స్థానిక పోలీసులను ఆశ్రయించాడు. బాధితుని కథనం..పెద్దపంజాణి మండలం సల్లావూరుకు చెందిన శంకరకు ఎనిమిదో తరగతి చదివే కుమార్తె ఉంది. మూడునెలల క్రితం భార్యాభర్తల గొడవల కారణంగా భార్య కుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. ఇలా ఉండగా పట్టణంలోని కిట్టన్న మిషన్ ప్రాంతానికి చెందిన ఓ 35 ఏళ్ల వ్యక్తితో మూడు రోజుల క్రితం తన కుమార్తెనిచ్చి రహస్యంగా పెళ్లి చేసిందనే విషయం తెలిసి పోలీసులను ఆశ్రయించినట్టు తెలిపారు.

మంత్రి పెద్దిరెడ్డి పర్యటనను విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్

రామకుప్పం: మండలంలో ఈ నెల 26, 27 తేదీల్లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులను చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీ భరత్ కోరారు. ఆకందగానిపల్లెలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పంచాయతీ కేంద్రాల్లో మంత్రి పల్లెబాట కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా స్థానిక సమస్యలు, అభివృద్ధి పనుల వివరాలను మంత్రి దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. కుప్పంలో చంద్రబాబును ఓడించడమే లక్ష్యంగా పార్టీ క్యాడర్ పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్‌రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

శాంతిపురం: రెవెన్యూ శాఖ అధికారుల నిర్లక్ష్యం రైతుల పాలిట శాపంగా మారింది. మండలంలో భూ పంపిణీ కార్యక్రమం ద్వారా అసైన్డ్(డీకేటీ) భూములను సాగు చేసుకుంటున్న రైతులకు వాటిపై హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం పట్టాదారు పాసు పుస్తకాల జారీకి ఆదేశాలు జారీ చేసింది. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి మూడు నెలల పాటు లబ్ధిదారుల గుర్తింపునకు అవకాశం కల్పించింది. కానీ మొదటి విడత భూ పంపిణీ వివరాల నమోదు గడువు ముగిసేంత వరకూ కూడా రెవెన్యూ అధికారులు జాబితాలను ప్రభుత్వానికి పంపలేక పోయారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కుప్పంలో నామ మాత్రంగా భూ పంపిణీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందాయి. మిగిలిన శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లి మండలాల నుంచి కనీస ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయక పోవడంతో ఆయా మండలాల్లో అసైన్డ్ భూములను నమ్ముకున్న వారికి నిరీక్షణే మిగిలింది. అసైన్డ్ భూములను అభివృద్ధి చేసి, సాగు చేసుకుంటున్న వారిలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులంబాలే అత్యధికంగా ఉన్నాయి. ఒక శాంతిపురం మండలంలోనే 10 వేల ఎకరాలకు మించిన విస్తీర్ణంలో అసైన్డ్ భూములు సాగులో ఉన్నాయి. ప్రభుత్వ ఉత్తర్వులతో వీటి సాగుదారులకు మేలు జరిగే అవకాశం వచ్చినా అధికారుల అలసత్వంతో వారికి ఆ హక్కులు దక్కలేదు. త్వరలో రెండో విడత భూ పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చే అవకాశం ఉండడంతో అప్పుడైనా పేద రైతులకు న్యాయం చేసేలా రెవెన్యూ అధికారులు సమాయత్తం కావాల్సి ఉంది. దీనిపై కుప్పం ఆర్డీఓ శివయ్యను వివరణ కోరగా కుప్పం మండలం నుంచి మాత్రమే తమకు ప్రతిపాదనలు అందాయన్నారు. వాటిని ప్రభుత్వానికి నివేదించామని చెప్పారు. మిగిలిన మండలాల నుంచి సకాలంలో సరైన ఫార్మెట్‌లో ప్రతిపాదనలు రాలేదన్నారు.

ప్రభుత్వ బడులకు మంచిపేరు తేవాలి



ఎంఈఓ-2ను సన్మానిస్తున్న హెచ్‌ఎంలు, టీచర్లు



హెచ్‌ఎం గురుమూర్తిని సన్మానిస్తున్న నాయకులు, క్రిష్టాపురం గ్రామస్తులు

పలమనేరు: ప్రభుత్వం నాడు-నేడు మన బడుల ద్వారా పాఠశాలలను అభివృద్ధి చేసిందని, విద్యార్థులకు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోందని, ఈ దిశగా మంచి ఫలితాల కోసం ఉపాధ్యాయుల శ్రమించి స్కూళ్లకు మంచి పేరు తేవాలని ఎంఈఓ లు లీలా రాణి, బాలసుబ్రమణ్యం సూచించారు. నూతన ఎంఈఓ-2, పలువురు హెచ్‌ఎంలకు మండలంలోని ఉపాధ్యాయులు పట్టణంలోని ఓఎల్ఎల్ స్కూల్‌లో గురువారం సన్మానించారు. వారు మాట్లాడుతూ, ఉత్తమ విద్యాబోధనతో మంచి ఫలితాలను సాధించాలని కోరారు. ఇదలా ఉంచితే, మండలంలోని క్రిష్టాపురం పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై సంబార్‌పూర్‌కు వెళ్లిన ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం గురుమూర్తిని గ్రామస్తులు, టీచర్లు సన్మానించారు. ఈ వేర్వేరు కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక, సర్పంచ్ తిరుమలేష్, ఎంపీటీసీ వినాయక, పలు ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు విజయకుమార్, ఈశ్వరప్రసాద్, నేతాజీ, గణపతి, ఉపాధ్యాయ సంఘాల నేతలు, టీచర్లు పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి చాలా ప్రమాదకరం



శిక్షణా తరగతుల్లో ప్రసంగిస్తున్న డాక్టర్ రాజ

రొంపిచెర్ల: కుష్ఠువ్యాధి చాలా ప్రమాదకరమని పీహెచ్‌సీ డాక్టర్ రాజ అన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం కుష్ఠు వ్యాధికి ఆరోగ్య సిబ్బందికి ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ముక్కులో నుంచి కారుతున్న నీరు, కంటి సమస్యలు, కండరాల బలహీనత వంటి సమస్యలు ఉంటే వారికి కుష్ఠువ్యాధి సోకినట్లేనని గుర్తించాలన్నారు. ఇది ప్రారంభం దశలతోనే మందులు వాడి తగ్గించుకోవచ్చన్నారు. ఇది సాధారణంగా 20 ఏళ్ల తరువాత వ్యాధి బయట పడుతుందన్నారు. దీనిపై అప్రమత్తంగా ఉండాలన్నారు. పేదరికం కుష్ఠువ్యాధి బారిన పడే ప్రమాదాన్ని పెంచుతుందన్నారు. రోగ నిరోధక శక్తి తగ్గించి కుష్ఠు వ్యాధిని పెంచుతుందన్నారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ దినేష్ కుమార్ నాయక్, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సీహెచ్‌ఓ కాంతమ్మ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

‘మీ సేవలు ప్రశంసనీయం’



సచివాలయ ఉద్యోగులను సన్మానిస్తున్న నాగభూషణం, అలీమ్‌బాషా

పుంగనూరు: సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని, వారి రుణం తీర్చుకోలేనిదని రాష్ట్ర జానపదకళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం అన్నారు. గురువారం మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో బదిలీపై వెళ్తున్న 8 మంది కార్యదర్శులకు ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికారు. అనంతరం నాగభూషణం మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సచివాలయ వ్యవస్థ ప్రజల ముంగిటకు వెళ్లి సమస్యలు పరిష్కరిస్తోందని కొనియాడారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత నియోజకవర్గంలో సచివాలయ వ్యవస్థ ఆదర్శంగా పనిచేస్తోందని ప్రశంసించారు. సచివాలయ ఉద్యోగులు రానున్న ఏడాది కాలంలో ప్రజలకు మరిన్ని సేవలు అందించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిరకాలం ముఖ్యమంత్రిగా ఉండేలా ఆశీస్సులు అందించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు జింకా వెంకటాచలపతి, వైస్ చైర్మన్లు లలిత, నాగేంద్ర, డీఈ మహేష్, కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు 24 వరకే గడువు

సదుం: స్థానిక ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలలో ఇంటర్‌లో ప్రవేశానికి ఈనెల 24 వరకే దరఖాస్తుకు గడువు ఉందని ప్రిన్సిపల్ శ్రీనివాసులరెడ్డి గురువారం తెలిపారు. ఫస్ట్ ఇయర్ ఎంపీసీ, బైపీసీలో 20 సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నట్టు చెప్పారు. 26న విద్యార్థులను రోస్టర్, మెరిట్ విధానంలో ఎంపిక చేస్తామన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్‌ను కలసిన పిరమళై కల్లర్ కులస్తులు



బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం ఇస్తున్న పిరమళై కల్లర్ నేతలు

పలమనేరు: పట్టణానికి చెందిన పిరమళై కల్లర్ కులాన్ని బీసీ జాబితాలో చేర్చి కులధ్రువీకరణ పత్రాన్ని మంజూరు చేయాలని ఆ సంఘ రాష్ట్ర నేతలు ఈశ్వర్ దేవర్ తదితరులు అమరావతిలో బీసీ కమిషన్ చైర్మన్ శంకర్ నారాయణను కలసి వినతిపత్రం ఇచ్చినట్లు గురువారం తెలిపారు.ఆరు దశాబ్దాల క్రితం తమిళనాడు నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వలస వచ్చిన తమ కుటుంబీకులు సైకిళ్లపై మురుకులు విక్రయిస్తూ కుటుంబాలను పోషిస్తున్నట్టు చెప్పారు. అయితే గెజిట్‌లోని బీసీ కులాల జాబితాలో తమ కులం లేకపోవడంతో నష్టపోతున్నట్టు చెప్పారు. ప్రభుత్వ పథకాలకు అర్హత లేక పిల్లల చదువులకు ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరి వెంట రాష్ట్ర సంచారజాతుల సంఘ అధ్యక్షులు పూసల రవి పాల్గొన్నారు.